క్లుప్తంగా

క్రీడాపోటీల్లో ప్రతిభ

తుగ్గలి: పగిడ్యాలలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి బి.హరి క్రిష్ణ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆ విద్యార్థి త్వరలో చిత్తూరు జిల్లా యాదమర్రి గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చందునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి హరికృష్ణను హెచ్ఎం జయలక్ష్మి, పీఎంసీ చైర్మన్ మల్లికార్జున, అభినందించారు.

సీపీఐ నాయకుడి మృతి



హనుమప్ప (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లిబోయిన హనుమప్ప (55) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కర్నూలు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, తదితరులు సంతాపం తెలిపారు.

300 మందికి చేదోడు లబ్ధి

తుగ్గలి: ప్రభుత్వం రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ వృత్తులపై ఆధారపడి జీవించే పేదలకు అందించే 'జగనన్న చేదోడు' పథకం ద్వారా మండలంలో 300 మందికి లబ్ధి చేకూరినట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. ఈ వృత్తులపై ఆధారపడి జీవించే అర్హులైన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. 4వ విడత నిధులను గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మిగనూరులో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు



ఎల్లార్తి దర్గాలను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగి తాత దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

పొట్టేళ్ల అపహరణ

తుగ్గలి: మండల పరిధిలోని పీ.కొత్తూరులో మరో పొట్టేలు అపహరణకు గురైంది. ఇంటి సమీపంలోని కొట్టంలో కట్టేసిన పాండుకు చెందిన రెండు పొట్టేళ్లు 25 రోజుల క్రితం అపహరణకు గురికాగా, బుధవారం రాత్రి సురేంద్రకు చెందిన మరో పొట్టేలును దొంగలు ఎత్తుకెళ్లారు. దాదాపు రూ.50 వేల దాకా నష్టపోయినట్లు బాధితుడు వాపోయారు. ఈ మేరకు జొన్నగిరి పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నాడు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

హొళగుంద: కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ నాయకులు హొళగుందలో కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు పెద్యాట మారెప్ప మాట్లాడుతూ వర్షాభావం వల్ల తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవడానికి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్‌లో రైతులు పెద్ద ఎత్తున పంటలు సాగు చేశారని, అయితే వర్షాలు లేక వేలాది హెక్టార్లలో పంటలు దెబ్బతిని రైతులకు భారీ ఎత్తున నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పనులు లేక కూలీలు వలస బాట పడుతున్నారని వాపోయారు. అలాగే పంట రుణాలను మాఫీ చేయాలని, పంటలను బట్టి రూ.లక్ష వరకు పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు రంగన్న, కృష్ణయ్య, బాషా, గాదిలింగ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక రైతు మృతి

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎస్.పేరేముల గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణ (39) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య రామేశ్వరి ఇచ్చిన పిర్యాదు మేరకు.. రైతు బాలకృష్ణ తన సొంత పొలం ఎకరాతో పాటు, 6 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం భార్యతో కలిసి వెళ్లి తన పొలంలోని కంది పంటకు పురుగు మందు పిచికారీ చేసి భార్యకంటే ముందుగా ఇంటికి వచ్చాడు. కొంత సేపటి తర్వాత భార్య ఇంటికి వచ్చి చూడగా అప్పటికే పురుగు మందు తాగి పడి ఉన్నాడు. ఆందోళన చెందిన భార్య చుట్టుప్రక్కల వారి సహాయంతో భర్తను వెల్దుర్తి ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలకృష్ణ కోలుకోలేక మృతి చెందాడు. వ్యవసాయానికి, కుమారుల చదువులకు తెచ్చిన అప్పులు తీర్చలేనన్న మనస్తాపంతో భర్త పురుగు మందు తాగినట్లు రామేశ్వరి తన ఫిర్యాదులో పేర్కొంది. ఏఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

జగనన్న చేదోడు సభ గ్రాండ్ సక్సెస్

- భారీగా తరలివచ్చిన లబ్ధిదారులు, మహిళలు
- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన సీఎం వైఎస్ జగన్



ఎమ్మిగనూరులో సభా స్థలి వద్ద ఏర్పాటు చేసిన జగనన్న చేదోడు పథకం నమూనా



వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్ బహుకరించిన నాగలితో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు నాల్గోవిడత ఆర్థిక సాయం విడుదల చేశారు. వేలాది మంది లబ్ధిదారులు, ప్రజలు, పార్టీ శ్రేణులతో సభా మైదానంతో పాటు వెలుపల కిక్కిరిసిపోయింది. స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జిల్లా ఉన్నతాధికారుల అంచనాలకు మించి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సభలో ఏర్పాటుచేసిన కుర్చీలన్నీ నిండిపోవడమే గాకుండా గ్యాలరీల్లో నిల్చొని, సభ బయట కూడా వేలాది మంది నిల్చొని జననేత వైఎస్ జగన్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. సభకు భారీగా జనం తరలిరావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపినట్లు అయ్యిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. సభా వేదికకు సమీపంలో ఉన్న పార్క్ ప్రహరీ గోడపైకి ఎక్కి వృద్ధులు, మహిళలు, అభిమానులు సీఎం వైఎస్ జగన్‌ను చూశారు. మహిళలు జై జగన్ అంటూ నినదించగా విద్యార్థులు, చిన్నారులు జగనన్నే మా భవిష్యత్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. రోడ్‌షోతో పాటు సభాప్రాంగణం, పలు ప్రాంతాల్లో అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు తీసుకొన్న చర్యలను పట్టణ ప్రజలు అభినందించారు.



ఫోటోలు తీస్తున్న యువతులు



సీఎం సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



వైఎస్సార్‌సీపీ జెండాతో చిన్నారుల సందడి



మా నమ్మకం నువ్వే జగనన్న ప్లకార్డు ప్రదర్శిస్తున్న వీరాభిమాని

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



వెల్దుర్తి: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల మహా సమాఖ్య సమావేశంలో పొదుపు గ్రూపు ప్రతినిధులు, సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాది. ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ యాంకర్ మాబువలి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులతో ఆరోగ్యంతోపాటు, లాభదాయకమన్నారు. ప్రతి సభ్యురాలు వారికి ఉన్న భూమిలో కొంతైనా ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. భూమిలేని వారు పెరటి తోటలు సాగు చేసుకుని ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవచ్చన్నారు. ఒక దేశీయ ఆవుతో 20 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని వివరించారు. ఆ శాఖ సిబ్బంది, సీసీలు పాల్గొన్నారు.

లలితాదేవి పాహిమాం



లలితాదేవిగా పెద్దమ్మ, స్కంద దేవిగా వాసవీమాత, లలితా త్రిపుర సుందరిగా గాయత్రీ మాత, లలితా త్రిపుర సుందరీ దేవీగా..

నందవరం: దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా 5వ రోజు పెద్దమ్మ తల్లి అమ్మవారు లలితా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని టి.సోమలగూడూరు గ్రామంలో గురువారం అమ్మవారు ప్రత్యేకాలంకరణలో లలితాదేవిగా దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలూరు: దేవీశరన్నరాత్రుల ఉత్సవాలలో భాగంగా గురువారం వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీని స్కంద అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు నరేంద్రశాస్త్రీ అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం గంగపూజ, కుంకుమార్చన, ఫల, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆస్పరి: శరన్నవరాత్రి పూజా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత, పార్వతీ దేవి, ఆస్పరిలోని కన్యకా పరమేశ్వరీ మాత భక్తులకు లలితా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలలో వేదపండితులు అనిల్‌కుమార్ శర్మ, పూజారులు రూపామోహన్‌శర్మ, మల్లికార్జునస్వామి, శాంతి రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పత్తికొండటౌన్: దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలను పత్తికొండ పట్టణంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. 5వరోజు గురువారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో కొలువైన వాసవీమాత గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు అమ్మవారిని అత్యంత శోభాయమానంగా పూలతో, ప్రత్యేక ఆభరణాలతో గాయత్రీదేవిగా అలంకరించారు. భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు చేసి, పూజలు చేశారు. ఉదయం పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి ఇచ్చారు.

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ గ్రామంలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఐదవరోజు బాల త్రిపుర సుందరీ దేవిగా దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయమే అమ్మవారికి అర్చకులు జలాభిషేకం, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

10 నెలల తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం

హొళగుంద: చనిపోయిన 10 నెలల తర్వాత శవానికి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన ఎల్లార్తి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఓ కేసుకు సంబంధించి కేరళ పోలీసుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాదాపు 10 నెలల క్రితం ఎల్లార్తి గ్రామానికి చెందిన గజేంద్ర (35) అనే వ్యక్తి అయ్యప్ప దీక్ష ధరించి శబరిమలైకు బయలుదేరారు. యాత్రలో ఉండగానే కేరళలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గజేంద్రను కుటుంబసభ్యులు ఇక్కడికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. ఇక్కడ కోలుకోలేక గజేంద్ర మృతి చెందగా గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. కేరళలో యాక్సిడెంట్ కేసు నమోదైనా మృతదేహానికి పోస్టుమార్టం జరగకపోవడంతో పాటు గజేంద్ర మృతిపై అనుమానం ఉందని భార్య సంధ్య ఇటీవల కేరళలో కేసు పెట్టింది. దీంతో ఎల్లార్తికి చేరుకున్న కేరళ పోలీసులు స్థానిక అధికారులు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, హెడ్ కానిస్టేబుల్ నాయక్, వీఆర్‌ఓ ప్రహ్లాద సమక్షంలో గురువారం గజేంద్ర మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయించారు.



కారుమంచిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలు,



పత్తికొండలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది,



వేముగోడులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

'ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం





విరుపాపురంలో కేస్ షీట్ అందజేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్, సర్పంచ్, బొమ్మిరెడ్డిపల్లెలో వృద్ధురాలికి కళ్లద్దాలు అందిస్తున్న దృశ్యం

గోనెగండ్ల: పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య సూచించారు. గురువారం మండలంలోని వేముగోడు గ్రామ పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఏడు రకాల ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికీ మెరుగైన చికిత్స నిమిత్తం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని తెలిపారు. శిబిరంలో డాక్టర్లు కార్తిక్, అపర్ణ, సింధూర, స్వర్ణ కుమారి 435 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి తోటయ్య, ఎంపీహెచ్ ఈఓలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కృష్ణగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా మారిందని కృష్ణగిరి జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి అన్నారు. పోతుగల్లు గ్రామంలో గురువారం ఆమె సర్పంచ్‌లు తెలుగు వాణిశ్రీ, కురువ అంజినమ్మ, ఎంపీటీసీ బేతాపల్లె రాజేశ్వరితో కలిసి సురక్ష శిబిరాన్ని ప్రారంభించి వైద్య సేవలపై ఆరా తీశారు. అందుబాటులో ఉంచిన మందులను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగనన్న చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం దేశవ్యాపంగా ప్రశంసలు అందుకుంటోందన్నారు. ఎంపీడీఓ విశ్వమోహన్, వైద్యులు ప్రదీప్, నాయకులు వెంకటేష్, సుధాకర్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎంపీపీ ఎం.నారాయణదాసు, మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గ్రామ సచివాలయం-4 పరిధిలో ఏర్పాటుచేసిన సురక్ష శిబిరాన్ని వారు ప్రారంభించారు. వైద్యాధికారులు శ్రావణి, రమేశ్, ఎంపీడీఓ కవిత, సచివాలయ కార్యదర్శి రోజా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని సర్పంచ్ విరుపాక్షిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముగతి గ్రామ సచివాలయం-1లో ఎంపీడీఓ దశరథరామయ్య ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 343 మందికి డాక్టర్లు వైద్య సేవలు అందించారు. 73 మందికి కంటి పరీక్షలు చేసి 26 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.



పోతుగల్లులో వైద్య సేవలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి

మద్దికెర: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని అన్నారు. గురువారం మద్దికెరలోని సచివాలయం-3 పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్‌డీ మద్దిలేటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: పేదలు ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎంబాయి భూలక్ష్మి అన్నారు. గురువారం గిరిగెట్లలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పైసా ఖర్చు లేకుండా గ్రామాల్లోనే వైద్య చేయడం పేదలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఎంపీడీఓ సావిత్రి, పంచాయతీ కార్యదర్శి గోపాల్, వైద్య బృందం పాల్గొన్నారు.

దేవనకొండ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తెర్నెకల్ గ్రామ సచివాలయం-1 పరిధిలో గురువారం సురక్ష వైద్య శిబిరంలో దాదాపు 1000 మందికి పైగా వైద్య చికిత్సలు చేయించుకున్నారు. వైద్యులు అరుణజ్యోతి, విజయభాస్కర్, పుష్పలత, భార్గవి రోగులను పరీక్షించి మందులను అందజేశారు.

ఉచితంగా కంటి పరీక్షలు చేశారు



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో నాకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. మందులు కూడా అందజేశారు. త్వరలో కళ్లద్దాలు ఇస్తామని చెప్పారు. గత మూడేళ్ల నుంచి కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నా. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రభుత్వం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు చేయడం సంతోషంగా ఉంది.

– బోగోటమ్మ, విరుపాపురం గ్రామం

పరీక్షలు చేసి మందులు ఇచ్చారు



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో నాకు ఉచితంగా రక్త పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉందని, రక్తం పెరగడానికి ఐరన్ మాత్రలను అందించారు. రక్తం తక్కువగా ఉండడంతో నీరసంగా ఉండేది. వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– గిరప్ప, విరుపాపురం గ్రామం

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 464 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. డాక్టర్లు గీతావాణి, బాలకృష్ణారెడ్డి, శశికిరణ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ చంద్రకళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో గురువారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో సచివాలయంలో ఏర్పాటు చేసిన క్యాంప్‌లో బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం గ్రామస్తులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యాధికారులు ఆనంద్‌రావ్, మోతిలాల్, నీలోఫర్ సీమ, వెంకటమహేష్ నాయక్, ఆప్తాలిస్టు కవిత వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు, పలువురికి కంటి అద్దాలను డీటీ ప్రసాద్‌రాజు, నార్లాపురం సర్పంచ్ కోటి రెడ్డి, వైద్యులతో కలిసి అందించారు.

హాలహర్వి: సురక్ష వైద్యశిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆంతోనీ, తహసీల్దార్ మల్లికార్జున స్వామి సూచించారు. మండలంలోని విరుపాపురం గ్రామంలో సర్పంచ్ మోకా సిద్దమ్మ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం చేపట్టారు. సీనియర్ వైద్యులు తిమ్మన్న, మన్సూర్‌వలీ రోగులకు 14 రకాల ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

చిప్పగిరి: మండలంలోని దౌల్తాపురం గ్రామంలో సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజలకు వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కొండయ్య, తహసీల్దారు లక్ష్మినారాయణ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.